# అహల్య పతివ్రత

కురుమద్దాలి విజయలక్ష్మి



"నీకు బుద్ధుందా లేదా?" అన్నాడు వెంకట్రావు.

అహల్య ఆలోచించకుండానే "బుద్ధా....! నాకా...! వుంది..." తాపీగా అంది.

"అదిగో ఆ ఇదే పనికిరాదు" ఆపైన ఏమనాలో తెలియక వెంకట్రావు చేతులు ముడుచుకుని పచార్లు ప్రారంభించాడు.

వెంకట్రావు భార్య అంటే అహల్య తల్లి ఆదిలక్ష్మమ్మ భర్త మౌనంచూసి తాను నోరు తెరిచింది.

"నీకేమొచ్చిందే. ఆ అబ్బాయిలో ఏమి లోపం చూశావే! చూడబోతే నవమన్మధుడిలా వున్నాడు. మంచి ఉద్యోగం చేస్తున్నాడు. అత్తపోరులేదు. ఆడబడుచు ఆరడిలేదు. ముసలి మామగారు ఉన్నారా అంటే, ఆయన ఉన్నా ఒకటే లేకపోయినా ఒకటే పండినఆకు ఏ నిమిషానయినా రాలొచ్చు. అబ్బాయికట్నం పెద్దగా ఇమ్మని అడగలేదు. కట్నం లేదనకుండా ఏదో ఒకటి ముట్టచెపుతామనుకో. అది వేరే విషయం. నీఅందంచూసి అబ్బాయి మోజుపడ్డాడు. అందువల్ల కట్నం పెద్దగా అడగలేదనుకుందామన్నా మనమెన్ని సంబంధాలు చూడలేదు, నీఅందం వాళ్ళకి నచ్చిందట కాని కట్నం మటుకు కోరినంత ఇవ్వాలిట. అవ్వా కావాలి, బువ్వా కావాలి అంటే కలా కాదే, రూపం బాగుంది, గుణంబాగుంది"

ఆదిలక్ష్మమ్మ పూర్తి చెయ్యకముందే అహల్య అందుకుంది.

"అమ్మా! అయిందా, లేక ఇంకా ఓ గంట కామా ఫుల్‌స్టాపులు సడన్‌బ్రేకులు లేకుండా ఇలా చెపుతూనే వుంటావా?"

"ఏమిటే పెద్దంతరం చిన్నంతరంలేకుండా ఆ మాటలు?"

"నా మాటలు గురించే ఆలోచించావుగాని నీ మాటల గురించి ఆలోచించావా? దానికీ ఓ మనసు, అభిప్రాయము వుంది. పిల్లవాడు నచ్చలేదు మొర్రో అని చెపుతున్నది. మనం బలవంతం చేయకూడదు. అని ఒక్కసారి అనుకున్నావా?"

వింటున్న వెంకట్రావుకి కోపం వచ్చింది.

"సరే బలవంతం చెయ్యము. పెళ్ళి చేసుకోవాలని కోరికుందో లేదో అదయినా చెప్పు. పోనీ ఎవడినయినా ప్రేమించి అఘోరించావేమో అదయినా చెప్పు"

"అలా అడిగారు బాగుంది నాన్నా! బి. ఏ. చదవటం పూర్తయింది ఖాళీగా వున్నాను. జాబ్ చెయ్యాలనిలేదు. పెళ్ళి చేసుకోవాలని వుంది. ఇంకా ఎవరిని ప్రేమించలేదు ఇహపై ప్రేమిస్తానేమో చెప్పలేను. ఇంకేమయినా అనుమానాలుంటే చెప్పండి తీరుస్తాను. ఏ అనుమానం లేకపోతే నేచెప్పేది నమ్మండి. ఇలాగే ఎవరో ఒకరు వచ్చి చూసి పోతుంటారు, వాళ్ళల్లో నాకు నచ్చినవాడు తప్పకుండా ఒకడు వుంటాడు. ఆనాడు నా పెళ్ళవుతుంది"

"బి. ఏ. వెలగబెట్టావు. ఇంతేనా నీ తెలివి? నీకు నచ్చినవాడు నిన్ను మెచ్చి పెళ్ళాడుతానని ఒప్పుకోకపోతే?" అంది ఆదిలక్ష్మమ్మ.

"అప్పుడప్పుడు గొప్ప తెలివి ప్రదర్శిస్తుంటావు" అన్నట్లు మెచ్చుకోలుగా భార్యవైపు చూశాడు వెంకట్రావు.

"అది నా ఖర్మకాదు. వాడి ఖర్మ సరేనా? ఇహ నన్ను విసిగించకండి" అని అహల్య తన గదిలోకి వెళ్ళి తలుపేసుకుంది.

"దీన్ని చూడటానికి వచ్చిన ప్రతివాళ్ళు అంతో ఇంతో అందగాళ్ళేను. కొందరయితే నవమన్మధులు. ఇదెవరినీ మెచ్చదేమిటండీ, నాకేమిటో భయంగా వుంది" అంది ఆదిలక్ష్మమ్మ.

"శుక్రుడొచ్చినా కళ్యాణమొచ్చినా ఆగదంటారు. దానికింకా కళ్యాణ ఘడియరాలేదు. అంతే" అన్నాడు వెంకట్రావు.

"అంతే అనుకోవాలి మరి" అంది ఆదిలక్ష్మమ్మ తలతాటిస్తూ.


వెంకట్రావు ఆదిలక్ష్మమ్మలకు ఏకైక సంతానం అహల్య. వెంకట్రావు లక్షాధిపతి కాకపోయినా డబ్బున్నవాడే. అహల్య ముట్టుకుంటే మాసిపోతుందా అన్నంత అందమైంది. బి. ఏ. చదివింది. బుద్ధిమంతురాలు. వారమాస పత్రికలకు ఉత్తరాలు రాయటం

వచ్చు. వీణ వాయింపటంవచ్చు. పాటచక్కగా పాడుతుంది. తానో పెద్ద అందగత్తెననే గర్వం లేదు. అయితే ఓ బలీయమైన కోరిక వుంది. అదపిల్లకుండేసహజమైన సిగ్గువల్ల మనసులో మాట బైట పెట్టటం లేదు.

ఆ కోరికయినా అసాధ్యమైనదేకాదు గొంతెమ్మ కోరికా కాదు. అతి సామాన్యమైనది. వింటే వెటకారంగా వుండవచ్చు. విన్నవారు ఎగతాళి చేయవచ్చు అందుకే అహల్య తన కోరిక బైట పెట్టటంలేదు. మనసు మంచిదయి వుండాలి రూపందేముంది? అనుకుంటుంటుంది.

అహల్య తెల్లగా వుంటుంది. అందంగా వుంటుంది. అలా వుంటుంది కాని...తనకి రాబోయే మొగుడు తెల్లగాను అక్కరలేదు. అక్షరాలా ఎలా వుండాలంటే...!

అతగాడు ఆరడుగుల ఎత్తుండాలి. ఆ ఎత్తుకి తగిన లావుండాలి. వక్షస్థలం విశాలంగా వుండాలి. ఎప్పుడైనా ఆ విశాల హృదయం మీద తలపెట్టుకుని ఏడ్వటానికేమో) పొడుగాటి బాహువులు. వేళ్ళు పొడుగ్గాను వుండాలి. ఇంకా...నెత్తిమీదనేగాక చేతులకి కాళ్ళకి విశాల వక్షస్థలానికి వత్తుగా నల్లని జుట్టుండాలి. అన్నట్టు కనుబొమలుకూడా వత్తుగా వెడల్పుగా వుండాలి. మూతిమీద మీసం బలిసినంతవాలు. గడ్డం సన్నగా వుండాలి. ఇవన్నీగాక అసలుది అతగాడు గొడుగుపట్ట రంగులోగాక కాటుకరంగులో వుండాలి. అలాంటి రూపంగలవ్యక్తి కనపడితే అహల్య వెంటనే తన మనసు తనువు అర్పిస్తుంది. జీవితాంతం ఆరాధిస్తుంది. ఇదీ అహల్య కోరిక.




ఈ కాలం చదువుకున్న అమ్మాయిలు యద్దనపూడి హీరోని, శోభన్‌బాబు లాంటి నాయకుడిని, అమితాబచ్చన్‌లాంటి మగవాణ్ని కోరుతారు. అంతేగాని నల్లనివాడు, పద్మనయనమ్ములవాడు, వళ్ళంతా బొచ్చుండువాడు అంటూ కోరరు.

అహల్య దృష్టిలో మగటిమి (ఇది నవలలో వాడేమాట) గలవాడు అంటే కారునలుపుతో రాక్షసాకారంతో కాండ్రముచ్చులా శరీరమంతా రోమాలు కలిగి హైదరాబాద్ రోడ్లలా విశాలమైన ఛాతీ వుండే వాడన్నమాట.

ఇలాంటివాడు భర్తగా కావాలని అహల్య చెప్పలేదు. వెంకట్రావు దృష్టిలో అలాంటివాడు అల్లుడిగా తగినవాడు కాదు. అందుకే వెంకట్రావు ముందే పిల్లవాడి రూపలావణ్యాలు చూసిగాని పెళ్ళి చూపులకి ఆహ్వానించేవాడు కాదు. వచ్చినవారు అహల్యను నచ్చేవాడు కాదు.

అహల్య తన మనసు బైటపెట్టేది కాదు. వెంకట్రావు ఇంకా ఇంకా అందమైనవాళ్ళ కోసం వేట ప్రారంభించాడు.

అహల్యకు విసుగు వచ్చింది నల్లనైన ఆరో సంబంధం. అతగాడిని చూసే చేసుకోను పొమ్మంది. పుర్రెకో బుద్ధి జిహ్వకో రుచి.

రోజులు గడిచి పోతున్నాయి.

అహల్యకి ఇరవై రెండో ఏడు ప్రవేశించింది.

అహల్యకింకా పెళ్ళి కాలేదు.

అహల్య అందమైనది సుకుమార దేహం కలది కాబట్టి పదహారేళ్ళ బాలాకుమారిలాగానే వుంది.

అహల్యని చూడటానికి ఇంకా అబ్బాయిలు అందమైనవాళ్ళు వస్తూనే వున్నారు.

అహల్య వద్దంటూనే వుంది.

ఇంజనీరు శేఖరానికి ఇరవై ఏడో ఏడు. ఎంతమందినో అందమైన అమ్మాయిలను చూశాడు. చూసిన ప్రతి అమ్మాయీ శేఖరానికి నచ్చింది గాని వాళ్ళే శేఖరాన్ని చేసుకోము పొమ్మన్నారు.

అందమైన అమ్మాయి భార్యగా కావాలి శేఖరానికి...

గొల్లాలాంటి మొగుడు కావాలని అహల్యకి...కోరిక...

వాళ్ళ జన్మలో కోరిక నెరవేరదు అని శేఖరము, అహల్య నిరాశ పడిపోయిన సమయంలో, ఇరువురికి పెళ్ళిచూపులు జరిగాయి.

"చేసుకుంటే ఇలాంటి అమ్మాయినే పెళ్ళి చేసుకోవాలి కాని నాకు అదృష్టంలేదు. ఈ పిల్ల బంగారపు బొమ్మలా వుంది, నన్నుదన్నే చేసుకోదు కాబట్టి ముందే నాకు పిల్ల నచ్చ లేదని చెప్పేస్తే సరిపోతుంది" అనుకున్నాడు శేఖరం.

ఇతగాడే నా భర్త. నన్ను చేసుకోటానికి ఎగిరి గంతేస్తాడు" అనుకుంది అహల్య.

పెళ్ళిచూపుల తతంగం అయిపోయింది.

"పిల్ల నచ్చలేదని" కబురు చేశాడు శేఖరం.

"పెళ్ళంటూ చేసుకుంటే శేఖరాన్ని తప్ప ఇంకెవరినీ చేసుకోనంది" అహల్య.

శేఖరం నా అల్లుడా? రామ రామ" అనుకున్నాడు వెంకట్రావు.

"దరిద్రనారాయణుడు కూడా చూస్తూచూస్తూ అలాటివాడికి పిల్లనివ్వడు" అనుకుంది ఆదిలక్ష్మి.

అహల్య కోరికపై, గత్యంతరం లేక వెంకట్రావు శేఖరం వద్దకెళ్ళాడు.

"నాయనా శేఖరం! నిన్నుతప్ప పెళ్ళాడనని ఘోర శపథం చేసింది. నీకు కావలసినంత కట్నం ఇస్తాను. రోజూ నీ పేరు రామ నామజపంలా స్మరిస్తాను. (నా ఖర్మ) నీకాళ్ళు పట్టుకు మొక్కుతాను. [వసుదేవుడంతటి వాడికి తప్పలేదు] నా కూతురు మెడలో మూడు ముళ్ళు వేయక పోయావా? నేను గంగలో దూకుతాను (అన్న ఊళ్ళో కృష్ణసంగతి గుర్తుకు రాలేదు) అదీ...ఇదీ..." అంటూ వెంకట్రావు శేఖరాన్ని బతిమిలాడాడు.

శేఖరం లోలోపల ఆశ్చర్యపోతూ పైకి బెట్టుపోయి మరీ బెట్టుపోతే మొదటికే మోసం వస్తుందని "మీ కష్టం పెద్దవారు మీరు బతిమిలాడుతున్నారు కాబట్టి ఊ అంటున్నాను." అన్నాడు.

"అఘోరించావ్! అని మనసులోను..." అమ్మమ్మమ్మ అంతమాటనవద్దు, ఇంజనీర్ అల్లుడంటే మాటలేంటి మీలాటి అల్లుడు దొరకటం నా అదృష్టం." అని పైకిపేర్చి ఊరుకున్నాడు వెంకట్రావు.

ఓ శుభముహూర్తాన శేఖరం అహల్య మెడలో మూడుముళ్ళు వేశాడు. అక్కడితో




శేఖరంభార్య అహల్య. అహల్య మొగుడు శేఖరం.

వివాహమైన నాలుగోనాడు శోభనం ఏర్పాటు చేశారు.

శేఖరాన్నిచూసి అమ్మలక్కలు బుగ్గలు నొక్కుకోవడం అహల్య గమనించింది. నా మొగుడు నాకు నచ్చాడు. వీళ్ళకేం తీపరం?" అనుకుంది.

ఎవరో ఏదో అనుకోవడం శేఖరంవిన్నాడు పళ్ళునూరుకున్నాడు. శేఖరంని అహల్యనిగదిలో పెట్టి తలుపేశారు అమ్మలక్కలు.

ఆవేశంతోను ఆతృతతోను పళ్ళుపై తెలియన్ని పెద్దలంటారు. "అప్సరసలాంటి భార్య పొందు ఎప్పుడెప్పుడా?" అని శేఖరం. "ఆయన విశాల వక్షస్థలంపై తలవాల్చి ఇరుపాటి బాహువుల్లో ఎప్పుడు వాలిపోదామా?" అని అహల్య ఆతృతా ఆవేశాలతో ఉన్నారు గాబట్టి అమ్మలక్కలు తలుపెయ్యంగానే స్థంబానికి పాకిన లతలా పెనవేసుకు పోయారు.

ఓ నెల అలాగే వున్నారు. [రోజూమొత్తం కాదు] ఆనందం అనుభవిస్తూ.

ఓ రోజు...

"నాలో ఏం చూసి కోరి పెళ్ళాడావు?" అన్నాడు శేఖరం.

"నాకు నచ్చారు అంతే, నేను బాగుటా కదా. ముందు నన్ను చేసుకోను పొమ్మని ఏందుకన్నారు?" అంది అహల్య.

"నువు బాగుంటావని నువ్వే చెప్పకు మురిసి పోతున్నావు. అంటేనే బాగుందనని అర్థం. అదెలాగూ నిజమే అనుకో. ఇన్‌డైరెక్ట్‌గా ఎందుకనాలి నే బాగుండనని తెలిసి నన్నెందుకు చేసుకోవాలి? అంత బలవంతం ఏ మొచ్చింది? ఏం జరిగింది?" శేఖరం నల్ల మొహాన్ని ఎర్రచేసుకు అడిగాడు.

"మీరు బాగుండరని మీరనుకోవల్సిందే. నేనేం అనలేదు. అసను, మీరునల్లగావళ్ళంతా జుట్టుతో ఇంతెత్తు ఇంత లావుతో రాజాలా వుంటారు. మీకేం మీ ముందు సినిమాహీరోలంతా దిగదుడుపే" అంది అహల్య.

శేఖరానికి నిలువెల్లా కోపం వచ్చింది. అహల్య తనని హేళన చేస్తున్నదనుకున్నాడు "మాడిపోయిన తప్పాలాచెక్క ...ఎలుగుబంటి కాకిపిల్ల... కొండమీద రాక్షసుడు... కాటిక్కాయ..." ఇలా ఓనాడుకాలేజీగరల్స్ పెట్టిన నిక్‌నేమ్స్ గుర్తుకు వచ్చాయి. అంతే కాదు పెళ్ళిలో ఎవరో ఏదో అనుకోగావిన్నది కూడా గుర్తొచ్చింది.

అహల్య అతనాడిని ఇష్టపడి చేసుకుంటున్నదను కున్నావా? అహల్య వెనకో పెద్ద కథవుంది. అహల్యకి పెళ్ళికాదని వాళ్ళనాన్న మెడవిరిచి బెదిరించి ఈ పెళ్ళికొప్పించాడు."

ఆ మాట ఆరోజు విన్నా పట్టించుకోని శేఖరం ఈ రోజు గుర్తు తెచ్చుకుని పట్టించుకుని ఆపై అసలే కోపంగా ఉన్నాడేమో...

"ఇదివరకెవరినో ప్రేమించావుటగా? ఆ ప్రేమ విఫలమైతే మీ నాన్న పీ మెడలోంచి నా కాళ్ళు పట్టుకుని నా కిచ్చి పెళ్ళిచేశాడుటగా? ఎవరికి తెలియదీ కథ. నేనే కావాలని ఏడ్చావుట. అలా అని మీ నాన్న నావద్దకొచ్చి ఏడ్చాడులే' పతితకు కబుర్లు చెప్పకు." ఓ అమానం మొగుడు పెళ్ళాన్ని ఎన్ని అంటాడో అన్ని మాటలూ అన్నాడు అహల్యని శేఖరం.

"మీరందంగా వుంటారని" అహల్య అన్నందుకు...

"నీవు మంచిదానివికావు (పతిత) అని శేఖరం అన్నందుకు...

ఇద్దరిమధ్య ఓ గంట పోట్లాట జరిగింది' తర్వాత ఓ రోజు జరిగింది.... ఆ తరువాత వారం జరిగింది... అ .. పై... తర్వాత అహల్య మొగుడితో పోట్లాడి, శేఖరం పెళ్ళాం మీద నిందవేసి దానా దీనా... అహల్య పతితగా ... కులటగా... పేరుబడిపి పుట్టిల్లు చేరుకుంది.

"ఆయనొప్పుకుంటే నా తప్పేంలేదని ఆయనంటే ... ఆయనతో కాపురం చేస్తానంది అహల్య.

"ఆ కులటని నేనేలుకోనన్నాడు శేఖరం.

ఇప్పుడు అహల్య పుట్టింట్లో ఓ రాయిలా పడుంది.

అనాడు గౌతముడు అహల్యని పతిత అని రాయికమ్మని శపించాడు. శ్రీరాముడి పాదం రాయికి తగలంగానే రాయి అహల్య అయి శ్రీరాముడు చెప్పాడు కాబట్టి అహల్యని ఏలుకున్నాడు గౌతముడు. అలా అని రామాయణంలో గాథలు రాసివుంది.

ఈ నాడు శేఖరం అహల్యని పతిత అని పుట్టింటికి పంపించాడు. అహల్య పుట్టింట్లో రాయిలా పడుంది. ఏ శ్రీరాముడన్నా ఈ అహల్య (లేక రాయి)కి పాదం తగిలించి ఆ పై శేఖరం వద్దకు తీసుకెళ్ళి "నేను చెపుతున్నాను నీ భార్య పతివ్రత. నా మాటవిని ఏలుకో" అంటే అప్పుడు శేఖరం...

"నా భార్య పతివ్రత అవునోకాదో నువ్వెవడివయ్యా చెప్పటానికి? దాని ప్రియుడివా? దేవేంద్రుడివా? కావాలంటే దాన్ని నువ్వే తీసుకెళ్ళి ఏలుకో, ఫో-ఫో..." అంటాడు.

అనాడు అహల్య దేవేంద్రుడితో ఓ గంటయినా కులాసాగా గడిపింది. అయినా అహల్య పతివ్రత.

ఈ నాడు అహల్య మొగుడితో తప్ప మగపురుగుతో నిమిషం గడిపి ఎరగదు. కాని పతిత అయింది.

శేఖరం అవునన్నా కాదన్నా ఇంకెవరన్నా ఏమన్నా అనాటి అహల్య పతివ్రత అయినా కాకపోయినా ఈ అహల్యమాత్రం పతివ్రతే.

దేముణ్ని అడగండి. రాముణ్ని అడగండి ఒకేమాట చెపుతారు.

"అహల్య పతివ్రత"

ఈ మాట ఎవరూ కాదనలేరు.




With Best Compliments from :

**Boina Vasudeva Rao & Sons**

KIRANA, GENERAL MERCHANTS & COMMISSION AGENTS

**NARASANNAPETA.**

Srikakulam Dist.

*With the best Compliments from :*

**National Electrical Appliencess**

**Prakasam Road**

**VIJAYAWADA-2.**